క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక




అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి

కమలాపూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల కమిటీని ఆది వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎం.భిక్షపతి, సహాయ ఎన్నికల అధికారి నహీమొద్దీన్, పరిశీలకుడు నర్సింహరామయ్య తెలిపారు. అధ్యక్షుడిగా బొనగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పింగిలి దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వి.ఈశ్వరయ్య, కె.లలిత, సహాయ కార్యదర్శిగా కె.బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.సాంబశివరావు, ప్రచార కార్యదర్శిగా సీహెచ్.పోచయ్య, అసోసియేట్ అధ్యక్షుడిగా ఇందుర్తి జానకిరామారావు, ఫైనాన్స్ సెక్రటరీగా వి.జనార్దన్ ఎన్నికయ్యారు. అనంతరం శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 12 మందిని మెరుగైన వైద్య చికిత్సల కోసం సిఫారసు చేశారు.

ముగిసిన ఈశా గ్రామోత్సవం



వాలీబాల్ విజేత ఏటూరునాగారం జట్టుతో ఈశా ఫౌండేషన్, వాలీబాల్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఆది వారం సాయంత్రం ముగిశాయి. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో వాలీబాల్ విజేత ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో రాంపూర్, తృతీయ స్థానంలో వా జేడు జట్లు నిలిచాయి. త్రోబాల్ విజేత చెర్లపాలెం, రెండోస్థానంలో శాయంపేట, మూడో స్థా నంలో ఎర్రబెల్లి జట్లు నిలిశాయి. ముగింపు వే డుకలకు డాక్టర్ భగీరథ ముఖ్యఅతిథిగా హా జరై విజేతలకు సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు.


జనహిత పాదయాత్రకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



జనహిత పాదయాత్రకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కమలాపూర్ : టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపు మేరకు చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఆదివారం జరిగిన జనహిత పాదయాత్రకు కమలాపూర్ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గుండపు చరణ్‌పటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రెండో విడత జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి తరలివెళ్లారు.

కొప్పలలో శాశ్వత గణపతి మండపం ప్రారంభం



మండపాన్ని ప్రారంభిస్తున్న మోహన్ రెడ్డి దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు గ్రామానికి చెందిన అడిదెల మోహన్‌రెడ్డి–వసుమతి దంపతులకు చెందిన స్థలంలో నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు రూ. 3 లక్షలతో శాశ్వత మండపం నిర్మించారు. ఆదివారం మోహన్‌రెడ్డి–వసుమతి దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించి మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సకల విఘ్నాలు తొలగించే ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరారు. వినాయక మండపానికి సహకరించిన మోహన్‌రెడ్డి దంపతులకు, దాతలకు ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన సామల శ్రీనివాస్ సౌండ్ బాక్స్‌ల కోసం రూ.35 వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామల మధుసూదన్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు

- 7 నెలల్లో 287 మందిపై కుక్కలు, కోతుల దాడి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శాయంపేటలో సంచరిస్తున్న కుక్కలు



కోతులు దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావంతో సాంబయ్య (ఫైల్)

శాయంపేట : మండల కేంద్రంలో రోజురోజుకు కుక్కలు, కోతుల దాడులు తీవ్రతరం అవుతున్నాయి. ప్రతీ వీధిలో కుక్కలు, కోతులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఓ కుక్క ఒకే రోజు 14 మందిపై దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఇంతే కాకుండా మండలంలోని కొప్పుల గ్రామంలో మూ డు నెలల క్రితం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు 13 మందిపై ఒకే కుక్క దాడి చేయడంతో కొందరు పరకాల ఏరియా ఆసుపత్రిలో, మరికొందరు ఎంజీఎం ఆస్పత్రిలో, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చే యించుకున్న సంఘటనలు ఉన్నాయి. ఉదయం వాకింగ్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా గతంలో చేనేత సొసైటీ ఎదుట ఒకేసారిగా 10 కుక్కలు గ్రామానికి చెందిన ఉప్పునూతు దేవేందర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వల్పదాసి సదాశివుడు సెంటర్ నుంచి ఇంటికి వెళ్తుండగా గ్రంథాలయం సమీపంలో 10 కుక్కలు దాడి చేశాయి. ఇటీవల మండల కేంద్రంలోని దళిత కాలనీలో గుంపులు గుంపులుగా దైనంపల్లి సాంబయ్యను, తెలుగువీధిలోని మామిడి అరుణను గాయపర్చడంతో తీవ్ర రక్తస్రావమైంది. గ్రామంలో ప్రతిరోజు ఎవరో ఒకరు కుక్కల బారిన పడాల్సి వస్తుందని చిన్నారులు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 6 నెలల్లో రేబీస్ టీకాలు 127 మందికి, కోతుల టీకాలు 160 మందికి వేసినట్లు వైద్యులు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో కోతులు, కుక్కల బెడదను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రోజు రోజుకు కుక్కల తీవ్రతరం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పని నిమిత్తం వెళ్లే చిన్న, పెద్దలపై కుక్కలు, కోతులు దాడి చేయంతో జంకుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని కుక్కల, కోతుల బెడదను నివారించాలి. – నామని కనకలక్ష్మి, శాయంపేట

వింత రోగాలతో కుక్కలు



కుక్కలు వింత రోగాలతో రోడ్లపై దర్శనమిస్తున్నాయి. 7 నెలల్లో 127 మందికి కుక్కల వ్యాక్సిన్, 160 మందికి కోతుల వ్యాక్సిన్ వేశాం. పీహెచ్‌సీలో వైద్యం అందించే పరిస్థితిలో లేకుంటే ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్నాము. – డాక్టర్ సాయికృష్ణ, మండల వైద్యాధికారి

ఒక యజ్ఞంలా అభివృద్ధి పనులు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ఒక యజ్ఞంలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దపెండ్యాలలో కుడా నిధులు రూ.46 లక్షలు, ఎస్సీఎస్పీ నిధులు రూ.22 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ధర్మసాగర్‌లో రూ.25 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీహరి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి 73 ఏళ్ల వయసులోనూ ప్రతీ రోజు నియోజకవర్గంలో తిరుగుతున్నానని అన్నారు. నేను అవినీతి, అక్రమాలకు పాల్పడ్డానని, ఎవరిదగ్గరైనా ఒక్క రూపాయి తీసుకున్నట్లు నిరూపించిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. చౌకబారు వ్యవహారాలకు నేను భయపడను, చేతకాని, చావలేని వారిని పట్టించుకోనని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.900 కోట్ల నిధులు తీసుకొచ్చానన్నారు. ఇందుకు సహకరించిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపెండ్యాల గ్రామం రాజకీయ కక్షల వల్ల చాలా నష్టపోయిందని తెలిపారు. ఒక్క ఏడాది కాలంలోనే దాదాపు రూ.6 కోట్ల నిధులు ఒక్క పెద్దపెండ్యాల గ్రామానికే కేటాయించినట్లు వివరించారు. అతి త్వరలోనే పెద్దపెండ్యాల నుంచి చిన్నపెండ్యాల రోడ్డు నిర్మాణం, అలాగే గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ధర్మసాగర్ మోడల్‌కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. పెద్దపెండ్యాల, ధర్మసాగర్ గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. పంచాయతీ రాజ్ శాఖ, కుడా అధికారులు, తహసీల్దార్ సదానందం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: ప్రతీ గ్రామానికి మెరుగైన వైద్యసేవలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లక్‌పేట గ్రామంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రేవూరితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మల్లక్‌పేట ఆర్చీ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు బైక్ ర్యాలీ చేపట్టి గ్రామంలో మొక్కలు నాటారు. ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేయాలనే ఆలోచనతో దొమ్మాటి సాంబయ్య ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషదాయకమని అభినందించారు. ఆరోగ్య పరిరక్షణలో ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అవసరమని అన్నారు. మాజీ జెడ్పీటీసీ పాడి కల్పనాదేవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొజ్జం రమేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. మండలంలోని హైబోతుపల్లి, వెంకటాపురం, లక్ష్మీపురం గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, గురిజపల్లి ప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీ చిలువేరు మొగిళి, గుండెబోయిన నాగయ్య, గుంట సమ్మిరెడ్డి, ఆలముదాపల్లి అశోక్, కోరె రమేష్, సనత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో ఎమ్మెల్యే విఫలం

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వేలేరు : మండలంలోని రైతులకు సాగునీరు అందించడంలో స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. ఆదివారం హనుమకొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మండల ముఖ్య నాయకులతో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మండలంలో 2023 ఫిబ్రవరి 27న రూ.104 కోట్లతో సాగునీటి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే శ్రీహరి పట్టించుకోకుండా మొద్దు నిద్రపోతున్నాడని మండిపడ్డారు. గండిరామారం, తరిగొప్పుల లిఫ్ట్ పనులకు ఇప్పటి వరకు నిధులు విడుదల చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని రైతులకు సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి సాగునీరు అందించేందుకు రైతుల పక్షాన ఈనెల 31న వేలేరు నుంచి గండిరామారం రిజర్వాయర్ వరకు పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజు, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, మహేందర్, ప్రభాకర్, నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాకే పాదయాత్ర చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

ఐనవోలు : కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరు గ్యారంటీలు నెరవేర్చాకే నియోజకవర్గంలో పాదయాత్ర చేయాలని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాలన వదిలి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ బాట పడుతున్నాడని విమర్శించారు. షాడో ముఖ్యమంత్రిగా మీనాక్షి నటరాజన్ నియోజకవర్గ కేంద్రంలో పాదయాత్రకు వస్తున్నారా అంటూ ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ ఏమైందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా రూ.500 చాలా మంది మహిళలకు అందడం లేదన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, కాలేజీ పిల్లలకు స్కూటీలు, ఒంటరి మహిళలు, వృద్ధాప్య పెన్షన్ రూ.4000, వికలాంగులకు రూ.6000 పెన్షన్ ఏవీ అమలు కాలేదన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు పాదయాత్ర పేరిట నాటకాలు ఆడుతారా అంటూ నిలదీశారు. భారతీయ జనతా పార్టీ తరఫున కాంగ్రెస్ పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాదాసు ప్రణయ్, ప్రధాన కార్యదర్శి పొన్నాల రాజు, జిల్లా నాయకులు మహేష్, మహిళ మోర్చా నాయకురాలు లలిత, శ్రీనివాస్, నర్సయ్య, వెంకటనారాయణ, సుధాకర్, సాగర్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

ఆత్మకూరు : స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని గుడెప్పాడ్, పెద్దాపూర్ గ్రామాల్లో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బొల్లోజు కుమారస్వామి, రవి యాదవ్, కేశవరెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేయడం సంతోషకరం

- మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి, రాజేందర్

శాయంపేట : గ్రామ ప్రజలకు వైనాల రాజేందర్ తన వంతు సేవలు అందించడం సంతోషకరంగా ఉందని మాజీ జెడ్పీటీసీ వంగాల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొప్పుల గ్రామంలోని శ్రీసాంబశివ దేవాలయం ఆవరణలో రాజేందర్ వైద్యశిబిరం ఏర్పాటు చేసి వినికిడి సమస్య ఉన్నవారికి వైద్యులచే వైద్యపరీక్షలు నిర్వహించి రూ. 8 లక్షల విలువైన వినికిడి సమస్య ఉన్న వారికి 40 వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు 8 బ్యాటరీ ట్రై సైకిళ్లు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి 20 వీల్ చైర్స్, 30 స్టాండ్స్, 60 చేతి కర్రలు అందజేయగా నారాయణరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ కొప్పులకు చెందిన వైనాల రాజేందర్ నిరుపేదలకు, వృద్ధులకు, దివ్యాంగులకు అవసరమైన బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చెర్స్, స్టాండ్స్, చేతి కర్రలు, వినికిడీ యంత్రాలు అందజేయడం సంతోషకరంగా ఉందన్నారు. రాజేందర్ నిరుపేదలకు తోడ్పాటును అందించి ప్రజల ఆదరాభిమాలు పొందుతున్నాడని రాజేందర్ లాగా మరికొంత మంది యువత ముందుకు వచ్చి గ్రామం కోసం పాటుపడాలని కోరారు. అనంతరం రాజేందర్‌ను నారాయణరెడ్డి, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్ కుమార్, నరేష్, జయంత్, మాజీ సర్పంచ్‌లు తోట కుమారస్వామి, గుర్రం రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేష్, వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు మామిడి కుమారస్వామి, గ్రామ వికలాంగుల పంఘం అధ్యక్షుడు జలుగూరి మహేష్, గ్రామస్తులు ధనుంజయ్, భాస్కర్, మురళి, సుదర్శన్, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సమస్యలు పరిష్కరించాలి

- జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య



సర్వే చేసి మాట్లాడుతున్న లింగయ్య

ఐనవోలు : గొర్రెలు, మేకల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఒంటి మామిడిపల్లిలో గొర్రెల కాపరుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్ల కాపరులు అనేక సమస్యలు సర్వే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గొర్రెలు, మేకలకు వస్తున్న వివిధ రోగాలకు మందులు ప్రభుత్వం నుంచి రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నట్టల మందు పంపిణీ చేయలేదన్నారు. బ్లూటంగ్ ఇంజక్షన్లు గ్రామానికి రాలేదని చెప్పారన్నారు. మేత కోసం అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారన్నారు. కుక్కల దాడిలో గొర్రెలు చనిపోతున్న విషయం తెలిపిందన్నారు. అనంతరం లింగయ్య మాట్లాడుతూ గొర్రెల కాపరులు తరతరాలుగా వృత్తినే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. గొర్రెలు, మేకలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. గొర్ల, మేకల పెంపకం దారుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు రాజారపు రాజు, కొమురయ్య, సందీప్, కొమురయ్య, చంద్రు, చేరాలు, యాదగిరి, మల్లయ్య, రమేష్, మల్ల య్య, సమ్మయ్య, బుచ్చయ్య, రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి

- ఎస్సై జక్కుల పరమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం గణపతి మండప నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఆన్‌లైన్‌లో అన్ని వివరాలతో అనుమతి తీసుకోవాలని సూచించారు. నవరాత్రి ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల తర్వాత మైకులు వాడొద్దని, మైకులు వాడేటప్పుడు సౌండ్ లెవెల్స్ ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే ఉంచాలని పేర్కొన్నారు. విగ్రహాల నిమజ్జనం కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ సూచించిన అధికారిక నిమజ్జన స్థలాల్లో మాత్రమే వినియోగించుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

మండపాలకు విద్యుత్ అనుమతి తీసుకోవాలి

దామెర : ఈ నెల 27 నుంచి నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు మండలంలోని గణపతి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు విద్యుత్ కనెక్షన్ కోసం తప్పనిసరిగా డీడీ తీసి అధికారుల అనుమతి తీసుకోవాని విద్యుత్‌శాఖ ఏఈ గుర్రం రమేష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల్లో విద్యుత్ కనెక్షన్ విషయంలో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ శాఖ సిబ్బందితో పనులు చేయించుకోవాలని సూచించారు. తడి చేతితో విద్యుత్ వైర్లను ముట్టుకోవద్దని, విద్యుత్ స్తంభాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వినాయక మండపాలను ఏర్పాటు చేయవద్దని తెలిపారు. వినాయక మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ సమస్య ఏర్పడినా సిబ్బందికి గానీ 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

ఎరుపెక్కిన ఆకాశం



వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో పాటు వాతావరణంలో మార్పు రావడంతో ఆదివారం మండల కేంద్రంలో ఉదయం నుంచి చల్లటి వాతావరణం చోటు చేసుకుంది. మధ్యాహ్నం కాస్త ఎండ వేడి ఉండగా.. సాయంత్రం 4 గంటల వరకు వాతావరణం చల్లబడింది. తర్వాత కాస్త ఎండ వచ్చినా కొద్ది సేపటికే సాయంత్రం కావడంతో ఆకాశం ఒక్కసారిగా ఎరుపెక్కింది. మేఘాలు సైతం ఎరుపెక్కి ఆకాశమంతా బంగారు వర్ణం వలే రూపుదిద్దుకుంది. దీంతో పుడమి వాతావరణం పూర్తిగా ఎర్రబడింది. ఎరుపెక్కిన ఆకాశంను చూసి స్థానిక ప్రజలు కాసేపు ఎంజాయ్ చేశారు. ఈ అరుదైన దృశాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. – ఎల్కతుర్తి

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

పరకాల : మండల కేంద్రానికి చెందిన మేడిపల్లి రాజేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ 1996– 97 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు రాజేశ్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం ఆది వారం అందజేశారు. రాజేశ్ కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

టిప్పర్లు సీజ్ చేసిన పోలీసులు



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామం నుంచి ధర్మారం గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొ రం తరలిస్తున్న రెండు టిప్పర్లను ఆదివారం స్వాధీనం చేసుకుని దామెర పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మొరం తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.